క్లుప్తంగా

గోపాలస్వామికి ప్రత్యేక పూజలు


ఆలయంలో కొలువుదీరిన గోపాలస్వామి

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ కల్కిదోనగుట్ట గోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారంతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి. మంగళవారం అభిషేకం, సత్యనారాయణ స్వామి పూజలు, దీపారాధన, హారతి కర్పూర నీరాజనం, తీర్థ ప్రసాదగోష్టి, వేద మంత్రాల పారాయణములు, సంకీర్తనలు తదితర పూజా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, ట్రస్టు చైర్మన్ సిద్ధాంతి పట్టాభిరామ శర్మ, ముఖ్య కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి శర్మ, నితిన్‌శర్మ, వేద పండితులు, భక్తులు శ్యాంసుందర్, ధనలక్ష్మి, శివాని, నేహ, జంగయ్య, భిక్షపతి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోచారం మాజీ సర్పంచ్ మృతి


సుధ్వారెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: పోచారం మాజీ సర్పంచ్ డోకూరి సుధ్వారెడ్డి(70) మృతి చెందాడు. రెండు రోజుల క్రితం స్వల్ప అనారోగ్యానికి గురికావడంతో యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందాడు. దీంతో పోచారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన 1987–93 వరకు సర్పంచ్‌గా పని చేశారు.

ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ చేయూత


మెటీరియల్ అందజేస్తున్న ఉప్పల ట్రస్టు సభ్యులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చేయూతనందించింది. గ్రామానికి చెందిన మల్లయ్య నిర్మిస్తున్న ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణానాయక్, నాయకులు కిశోర్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని బూర్గుల గ్రామ శివారులో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ నవీన్‌కుమార్ తెలిపా రు. సుమారు 60 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి బూర్గుల శివారులో జాతీయ రహదారి దాటుతుండగా జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయండి

చేవెళ్ల: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం చేవెళ్లలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, సమస్యల పరిష్కారానికి ఈ నెల12న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ సదస్సులో ప్రధాన డిమాండ్లు 10వేల కోట్ల బడ్జెట్‌తో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో 20శాతం ఉద్యమకారులకు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఉద్యమకారులకు పెన్షన్, ఉచిత బస్సు, ట్రైన్ పాసులను, ఆరోగ్య కార్డులను 300 గజాల ఇంటి స్థలాన్ని, వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ స్వా తంత్ర సమరయోధులుగా గుర్తించి గౌరవించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో విద్యార్థి ఉద్యమకారులకు కోటా కేటాయించాలన్నారు. ఇలా ఉద్యమకారుల కోసం ప్రభుత్వం ఈ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈ సదస్సులో చర్చించడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలోని ఉద్యమకారులు ఈ ఆత్మగౌరవ సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హోరెత్తిన హోలీ


ఇబ్రహీంపట్నం రూరల్: ప్రశాంత్‌రెడ్డితో ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి హోలీ సంబురాలు


ఇబ్రహీంపట్నం: రాయపోల్‌లో గ్రామ పంచాయతీ సిబ్బందితో సర్పంచ్ బల్వంత్‌రెడ్డి వేడుకలు

ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచే రంగుల కొనుగోలుకు ప్రజలు దుకాణాల్లో క్యూ కట్టారు. కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడాయి. ఆర్గానిక్ రంగుల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపారని అమ్మకందారులు చెప్పారు. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. డీజే చప్పుల మధ్య యువత నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు.

– ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు జోన్ బృందం


యాచారం: సంబురాల్లో దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా తదితరులు


మంచాల: ఆరుట్లలో..


తుర్కయంజాల్: కమ్మగూడలో..


ఆమనగల్లు: గంగాభవానీ కాలనీలో..


కడ్తాల్: మైసిగండిలో కాముడి దహనం


తలకొండపల్లి: వేడుకల్లో యువత, చిన్నారులు, ప్రజాప్రతినిధులు


కడ్తాల్: మైసిగండిలో నాయకుల సంబురాలు

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

వేంకటేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోశ్చరణాల నడుమ ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలు, ధ్వజ స్తంభ పటాన్ని ఆలయం ప్రాంగణం నుంచి కల్యాణం మండపం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు వసతులు కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, ఉపసర్పంచ్ తిరుపతి, ఆలయ చైర్మన్ రాజుకుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవి, ఆలయ అసిస్టెంట్ ఆంజనేయులు, సత్యం, కృష్ణగౌడ్, స్వామి, లక్ష్మయ్య, కృష్ణయ్య, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు

కొనసాగుతున్న ప్రగతి నివేదన యాత్ర

హోలీ సందర్భంగా ఉదయం విరామం

అబ్దుల్లాపూర్‌మెట్: నియోజకవర్గం వ్యాప్తంగా ప్రగతి నివేదన యాత్ర పేరుతో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోకి ప్రవేశించింది. మండల పరిధిలోని గండిచెరువు గ్రామంలో పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను, ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తిగౌడ్, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంగళవారం హోలీ సందర్భంగా ఉదయం పాదయాత్రకు విరామం ఇచ్చి మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గండిచెరువు శివారులో హోలీ వేడుకలను జరుపుకున్నారు. సాయంత్రం సుర్మాయిగూడ, లష్కర్‌గూడ గ్రామాల్లో సర్పంచ్ ఏనూరి సుజాత శేఖర్, సీక సాయిగౌడ్‌లతో కలిసి యాత్రను కొనసాగించారు.


భార్య, పిల్లలతో కలిసి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హోలీ సంబురాలు

నిధులు పుష్కలం.. పనులు శూన్యం

పరిష్కారం కాని పరిహారం
- నియోజకవర్గంలో నత్తనడకన కొనసాగుతున్న రోడ్డు నిర్మాణం


కందుకూరు-మీరాఖాన్‌పేట ఫార్మాసిటీ రోడ్డు

యాచారం: మండల పరిధిలో ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణం అయోమయంగా మారింది. నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ భూములు కోల్పోయే రైతులకు పరిహారం చెల్లింపు విషయంలో స్పష్టత కరువైంది. రెండేళ్ల క్రితమే ఈ రోడ్డు నిర్మాణ పనులకు నందివనపర్తి గ్రామంలో శంకుస్థాపన చేశారు. నాగార్జునసాగర్ రోడ్డు యాచారం మండల కేంద్రం నుంచి నందివనపర్తి మీదుగా నస్దిక్‌సింగారం, మీరాఖాన్‌పేట వరకు 12 కిలోమీటర్ల మేర ఫార్మాసిటీకి వంద అడుగుల రోడ్డును విస్తరించాలని టీఎస్‌ఐఐసీ నిర్ణయించింది. ఇందుకు రూ.70 కోట్లకు పైగా నిధులను రెండేళ్ల క్రితమే మంజూరు చేశారు. కానీ నేటికి సమస్య ఓ కొలిక్కి రావడం లేదు. నందివనపర్తి కేంద్రంగా జంక్షన్ ఏర్పాటు చేసి యాచారం -మీరాఖాన్‌పేట వరకు, నందివనపర్తి–నక్కర్తమేడిపల్లి వరకు దాదాపు 18 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరించాలని అధికారులు భావిస్తున్నారు. రోడ్డు వెడల్పులో 70 మందికి పైగా రైతులు దాదాపు 60ఎకరాల వ్యవసాయ భూమిని కోల్పోతున్నారు. ఈ భూమి ధర బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం ఎకరాకు రూ.2కోట్లకు పైగానే డిమాండ్ ఉంది. కానీ టీఎస్ఐఐసీ ఎకరాకు రూ.24లక్షల వరకే పరిహారం చెల్లిస్తామంటోంది. రైతులు మాత్రం ఎకరాకు కనీసం రూ.50లక్షలకు తగ్గకుండా మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ వెంచర్‌లో 121 గజాల ప్లాటును కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పలుమార్లు టీఎస్ఐఐసీ, రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిహారం, ప్లాట్ల కేటాయింపుపై స్పష్టత రావడం లేదు.

స్పష్టత లేని రూట్ మ్యాప్..

కందుకూరు మండలం మీరాఖాన్‌పేట నుంచి నందివనపర్తి, నందివనపర్తి నుంచి నక్కర్తమేడిపల్లి వరకు రోడ్డు నిర్మాణం విషయంలో అధికారులకు ఓ అంచనాతోపాలుగా రూట్ మ్యాప్, సేకరించాల్సిన వ్యవసాయ భూమి, బాధిత రైతుల వివరాలు ఉన్నాయి. నందివనపర్తి నుంచి యాచారం వరకు దాదాపు 3 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణంపై అధికారులు ఓ నిర్ణయానికి రావడం లేదు. రోడ్డు విస్తరణ చేపడితే మొగుళ్లవంపు, యాచారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పెద్ద సంఖ్యలో ఇళ్లు, దుకాణ సముదాయాలు కూల్చాల్సి వస్తుంది. పైగా సాగర్‌రోడ్డుపై పెద్ద జంక్షన్ నిర్మించేందుకు అర ఎకరానికి పైగా స్థలం అవసరం ఉంటుంది. జంక్షన్ నిర్మాణంతో పాటు, ప్లాంటేషన్‌కు స్థలం సేకరిస్తే దుకాణాలు, ఇంటి నిర్మాణాలు, మజీద్‌ను సైతం తొలగించాల్సి వస్తుంది. దీంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తారని నందివనపర్తి నుంచి నేరుగా తిరుమలనాథ ఆలయం సమీపం, హెచ్‌ఎండీఏ వెంచర్ నుంచి సాగర్‌రోడ్డుపై ప్రస్తుతం ఉన్న సాయి శరణం ఫంక్షన్ హాల్ ఎదుటకు రోడ్డు కనెక్టివిటీ తీసుకరావాలని టీఎస్ఐఐసీ, రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు ఓ అంచానాకు వచ్చారు. సర్వే సైతం పూర్తిచేశారు. కానీ రోడ్డు ఎటు నుంచి వస్తుందో.. ఎటు నుంచి నిర్మాణం చేపట్టాలో నిర్ణయం తీసుకోలేదు.

అక్కడ వేగం.. ఇక్కడ నిదానం

సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫార్మాసిటీకి నాగార్జునసాగర్, శ్రీశైలం రహదారిల నుంచి వంద అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టి నక్కర్తమేడిపల్లి, మీరాఖాన్‌పేట గ్రామాల మధ్య ప్రధాన రోడ్డును నిర్మించాలని నిర్ణయించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని శ్రీశైలం రహదారి నుంచి మీరాఖాన్‌పేట వరకు ఫార్మా రోడ్డు విస్తరణ వేగంగా జరిగింది. కందుకూరు నుంచి మీరాఖాన్‌పేట కల్వర్టులు, కొంత మేర రోడ్డు నిర్మాణం మాత్రమే పెండింగ్‌లో ఉంది. కానీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని నస్దిక్‌సింగారం సమీపం నుంచి నందివనపర్తి గ్రామం మీదుగా సాగర్‌రోడ్డు యాచారం వరకు రోడ్డు నిర్మాణం నత్తనడకన సాగుతోంది. అధికారులు పనులు ప్రారంభించడం, రైతులు అడ్డుపడడం, పరిహారం పెంచాలని డిమాండ్ చేయడం లాంటివాటితో పనులు ముందుకు సాగడం లేదు. ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణం విషయంలో యాచారం, మొగుళ్లవంపు, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, నక్కర్తమేడిపల్లి గ్రామాల రైతుల్లో ఏ మాత్రం వ్యతిరేకత లేకున్నా పరిహారం పెంచే విషయంలో, ప్లాట్ల కేటాయింపు విషయంలోనే ఇబ్బంది నెలకొంది. వ్యవసాయ భూముల ధరలు రూ.కోట్లల్లో పెరిగిన దృష్ట్యా ఎకరాకు రూ.50లక్షల పరిహారం, హెచ్‌ఎండీఏ వెంచర్‌లో 121 గజాల ప్లాటు కేటాయిస్తే రోడ్డు విస్తరణకు భూములు ఇవ్వడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు.

ఎమ్మెల్యేను కలుస్తాం



ఫార్మాసిటీ రోడ్డు విస్తరణకు భూములిచ్చే విషయంలో రైతులు ఆసక్తి చూపుతున్నారు. కానీ పరిహారం చెల్లింపు, ప్లాట్ల కేటాయింపు విషయంలో రైతులు మొండికేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో భూములు కోల్పోయే రైతులతో కలిసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలుస్తాం. అధికారులు ఎకరాకు రూ.30లక్షల వరకు పరిహారం, మీరాఖాన్‌పేట హెచ్‌ఎండీఏ వెంచర్‌లో 121 గజాల ప్లాట్ కేటాయించేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తాం. నందివనపర్తిలో రోడ్డు నిర్మాణంలో నాలుగు ఎకరాలు కోల్పోతున్నా.

– బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, నందివనపర్తి

వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

కొత్తూరు: వైజంక్షన్ కూడలి సమీపంలో నిర్మిస్తున్న అండర్‌పాస్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు మంగళవారం అధికారులను కోరారు.

సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడులు

ముందు జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్లను అరికట్టవచ్చు


ఏడీఏ రాజారత్నం

కొందుర్గు: వరిసాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరిపైరును చీడపీడలను ఆశించి పంట తెగుళ్ల బారిన పడే అవకాశముందని, రైతులు ముందు జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్ల బారిన పడే ప్రమాదం ఉండదని అంటున్నారు. యాసంగి సీజన్‌లో ఆలస్యంగా వరి నాటువేస్తే జింక్ లోపంతో పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. ప్రస్తుతం చలి తీవ్రత వల్ల వరిపైరు ఏపుగా పెరగడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వరినాటే సమయంలో ముందుగా దుక్కిలో ఎకరానికి 10 కిలోల జింక్ చల్లి కలియదున్నాలి. వరినాటిన అనంతరం పిలకదశలో ఉన్న వరిపైర్లలో లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

పిలకదశ నుంచి దుబ్బు దశలో ఉన్న వరిపైర్లలో నాచు ఉండడం వల్ల ఎదుగుదల ఆగుతుంది. ఇందుకోసం వరిపైరును చేతులతో కలియబెట్టాలి. అదేవిధంగా అప్పుడప్పుడు పైరును ఆరగట్టాలి.

- పొలంలో చవుడు, జింక్‌లోపం వంటి సమస్యల నివారణ కోసం సేంద్రియ గుళికలు వాడడంతో పాటు, ఎకరానికి 25 నుంచి 30 కిలోల యూరియా, కార్బండాజిమ్ 25 శాతం, మ్యాంకోజెబ్ 50 శాతం పొడి మందును చల్లాలి.
- యాసంగి సీజన్‌లో కొన్ని ప్రాంతాల్లో వరికి మొగిపురుగు ఉధృతంగా వస్తుంది. నివారణ కోసం క్లోరిపైరిపాస్ 10 జీ గుళికలు లేదా సైపర్‌మిత్రిన్, క్లోరిపైరిపాస్ మందును పిచికారీ చేయాలి.
- వరి నాటిన 15 నుంచి 40 రోజుల దశలో ఉన్న పైర్లలో కార్బోఫ్యూరాన్ 3జీ 10 కిలోలు, లేదా కార్ఫోహైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 25 కిలోలు చల్లాలి.
- వరిపంట అంకురం ఏర్పడే దశ నుంచి చిరుపొట్ట దశలో ఎకరానికి 60 మిల్లీలీటర్ల క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 400 గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరైడ్ లేదా 100 మిల్లీలీటర్ల టెట్రానిలిప్రోల్ మందును పిచికారీ చేయాలి. ఇలా వరిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ రాజారత్నం సూచిస్తున్నారు. అలాగే ఫిబ్రవరి, మార్చి మాసాల్లో వరికి అగ్గి తెగులు, మెడవిరుపు తెగులు వచ్చే అవకాశం ఉందని ఆయన సూచించారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


జిల్లేడ్ చౌదరిగూడ మండలం జాకారంలో వరిపైరును పరిశీలిస్తున్న ఏడీఏ రాజారత్నం

శేఖర్‌గౌడ్ మృతి పార్టీకి తీరని లోటు

కాంగ్రెస్ నేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి

యాచారం: కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు, కాంగ్రెస్ యువనేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు సురిగి శేఖర్‌గౌడ్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేసిన శేఖర్‌గౌడ్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని, శేఖర్‌గౌడ్ పిల్లల చదువు బాధ్యతను తానే తీసుకుంటానని అన్నారు. శేఖర్‌గౌడ్ భార్య సంగీతకు త్వరలో ఉపాధి అవకాశం కల్పిస్తామని అన్నారు. అధికారంలో లేదని పార్టీ శ్రేణులు ఆందోళన చెందవద్దని, అండగా ఉంటానని అన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా, ఈ ఏడాది చివరలో జరిగే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ మోటె శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గౌరారం వెంకట్‌రెడ్డి, నాయకులు జగదీశ్వర్‌రావు, భరత్‌రెడ్డి, నందు, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


చెక్కు అందజేస్తున్న నారాయణ

ఆమనగల్లు: మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కంఠ మహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నిట్టి నారాయణ రూ.1.50లక్షల విరాళం అందించారు. ఈ మేరకు మంగళవారం గౌడ సంఘం నాయకులతో ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రూ.1.50లక్షల చెక్కును గౌడసంఘం నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేఖర్‌గౌడ్, వార్డు సభ్యులు నర్సింహగౌడ్, సంఘం నాయకులు రాముగౌడ్, వీరేశ్, కొండల్, అంజయ్య, బాలయ్య, జంగయ్య, వెంకటయ్య, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

ఇరు ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి

వైఎస్సార్ టీపీ నాయకుడు జంగయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: వంట గ్యాస్ ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వానికి, విద్యుత్ చార్జిల పెంచిన రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని వైఎస్సార్ టీపీ నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర ధరలు పెంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను ఇబ్బంది పెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.